# చేదు గుళిక

జేబు తడుముకున్నాడు గోపి.

తనలా జేబు తడుముకోవడం అప్పటికి ఏ పదోసారి.

ఎన్నిసార్లు తడిమినా జేబులో పైసలుంటేనా?



వెధవది ఇరవై పూసలకు కూడా నోచుకోని జన్మయిపోయింది. అంత పెద్ద అమ్మ ఉంది. ఏం లాభం? ఇదిగో పావలా, నీ ఖర్చుల కుంచుకో అని ఏనాడైనా అందచేసిందా? ఈ భావంతో కూడిన కోపం–అవమానం కలగాపులగంగా గోపి కళ్ళల్లో ఎర్రజీరలు.

అవతల బుడగలు అమ్మేవాడు ఓ చేత్తో పైసలందుకొంటూనే పిల్లలందరికీ ఇస్తూనే ఉన్నాడు. అంత బిజీ షెడ్యూల్‌లోనూ మధ్య మధ్య అతను దూరంగా నిల్చొని తనకేసే ఆశగా చూస్తున్న గోపిని చూస్తున్నాడు.

పొద్దున్లేస్తే తనుచేసే ఈ వ్యాపారం అంతా ఇలాంటి కల్లకపటమెరుగని దేవళ్ళాంటి పసిపిల్లల మధ్యనే! వాళ్ళను తన దగ్గరకు ఆకర్షించుకోను కొన్ని బుడగలు గాలిలోకి వదులుతుంటాడు.

ఆ లెక్కన ఇప్పుడు తనను సమీపించకుండానే ఒక బుడగ ఇస్తే బావుణ్ణని ఆశగా చూస్తున్న ఆ కుర్రాడికి ఆశ తీరిస్తే తన సొమ్మేం తరిగిపోదు!

చూస్తుండగానే అతని చుట్టూ మూగిన పిల్లలు పలచబడ్డారు.

అంతదాకా ఆనందం తాలూకు కేరింతలతో బుడగలను సొంతం చేసుకున్న తన ఈడువారిని అదో సినిమాలా చోద్యంగా చూస్తున్న గోపి ఉలికిపడ్డాడు.

'ఇలారా బాబూ!' అని బుడగలమ్మేవాడు పిలుస్తూండడంతో–

తనని కాదేమో, ఇంకెవర్నైనా అతను పిలుస్తున్నాడేమోనని వెంటనే కదలలేదు.

చుట్టూ చూస్తే ఏ పిల్లాడూ లేడు.

అప్పుడు నిర్ధారణకు వచ్చాడు– అతను పిలుస్తున్న ది తననే అని.

నన్నెందుకితను పిలుస్తున్నట్టు? పిల్లలంతా వెళ్ళిపోయినా ఇంకా నేనెందుకిక్కడ ఉన్నానని వాకబుకా? ఒకవేళ రద్దీ తగ్గాక బుడగను కొనుక్కోవచ్చని ఆగానను కొంటున్నాడా? అదే ఉద్దేశ్యమైతే పప్పులో కాలేసినట్లే! నా దగ్గరే పైసలుంటే అసలు ఇంతదాకా ఆగుతానా? నెంబర్ వన్ దూకుడు చిచ్చర పిడుగుని. అందర్నీ తోసుకుని ముందుకొచ్చి మరీ బుడగను 'సొంతం' చేసుకొని ఈపాటికే కనుమరుగై ఉండనా? ఇదేమీ ఇతగాడికి తెలియదులే, పాపం...!

గోపి ఆలోచనతో తనకేం సంబంధం లేనట్లు దరిచేరిన అతని చేతిలో ఓ బుడగ పెట్టాడు అమ్మేవాడు. తీసుకో! అంటూ.

“నా దగ్గర డబ్బుల్లేవు! బేలగా ముఖం పెట్టాడు గోపి.

“ఫర్వాలేదులే, తీసుకెళ్ళు. నువ్వేదైనా కొనుక్కోను పావలా, అర్థా ఇవ్వదా మీ అమ్మ? జేబులో ఏం లేకుంటే పక్కవారు చిరుతిండి కొనుక్కొన్నా, ఇలా బుడగలు తీసుకొన్నా చూస్తూన్న నీకెంత బాధ? మీ అమ్మ పిసినారైనా కావాలి. బిడ్డను పద్ధతిగా కట్టడి చేసే మనస్తత్వమైనా కావాలి. ఏమిటో...కొందరు బిడ్డల్ని కన్నతల్లులింతే! అలాంటి తల్లుల్ని కలిగిన నీలాంటి పిల్లల మనస్తాపము ఇంతే...మాట్లాడ్తూ అతను అక్కడ్నుంచి నిష్క్రమిస్తుంటే చేతిలో బుడగ ఉన్న ఆనందం గోపికి కరువైంది.

“జెనబ్బీ! చివరగా నువ్వన్న మాటల్లో సత్యం....అనుక్షణం డిసిప్లిన్‌ను ఆచరణలో పెట్టే మా అమ్మకెలా ఉంటుందో కానీ నాకైతే ప్రాణం తోడేస్తూన్నట్లే ఉంటుందనుకో! అప్పటికీ మొన్నే మారు ఏంటి నాన్నా! అమ్మ మరీనూ...నాతో స్కూలుకొచ్చే నేస్తాలు రోజూ జేబులో నాణేలు లేకుండా రావడం లేదు. వాళ్ళ ముందు నాకెంత తలవంపులుగా ఉందనీ...ఈ విషయంగా అమ్మతో నువ్వైనా వత్తాసు పలకకూడదు? అని సాక్షాత్తూ నన్ను కన్న జనకునితోనే మొరపెట్టుకుంటే– నీకిష్టమైన చిరుతిళ్ళన్నీ అమ్మ స్వయంగా ఇంట్లోనే చేసిపెడ్తోందా! తను చేసేదంతా నీమంచికే కన్నా! బయట చిరుతిళ్ళలో నూనెలు మొదలుకొని అంతా కల్తీలే! ఆరోగ్యాన్ని దెబ్బతీసేవే! రోడ్లో దుమ్ము ధూళితో నిండి ఝుమ్మని ఈగలు వాలుతుంటే ఆ పదార్థాలను తినాలని నువ్వు ఆశపడ్డమేమిటి, ఛ! నీకేం కావాలన్నా అమ్మనడుగు రాజా! అదీగాక జేబులో డబ్బు కనబడితే చీట్లాటలకనీ, గోలీలాటలకనీ, కాయ్‌రాజా కాయ్ వ్యసనాలవైపుకు మళ్ళిస్తుంటారు కొందరు పైలా పచ్చీసు కుర్రాళ్ళు! చదువుకు చదువు, బుద్ధికి బుద్ధి అలా పాడయ్యే అవకాశాలెన్నో చేతిలో డబ్బుంటే! ఇదంతా ఆలోచించే మీ అమ్మ నీకు డబ్బివ్వడం లేదు. సర్లే...

రెండుచేతులా సంపాదించి తెచ్చి ఖాళీ చేతుల్లో వినమ్రంగా పోస్తుంటేనే ఆయనగారి జల్సా ఖర్చులకు ఆవిడగారు పర్దేది లేదు.

"గౌరీ! గౌరీ! అదనంగా ఇంకో ఏభై కనీసం ఈ నెల నుంచైనా నా పాకెట్ మనీగా ఇవ్వవే! రోజుకు రెండంటే రెండు సిగరెట్లు, రెండు టీలతోనే సరిపెట్టుకోమంటే ఎలానే? ఆఫీసులో నా కొలీగ్స్ పాకెట్ సిగిరెట్స్, అరడజనుకు పైగానే తేనీరు, అవీ చాలక మూడునాలుగు జర్దా కిళ్ళీలు ఇట్టే ఊదేస్తున్నారు. ఇంతాచేసి వాళ్ళంతా నాకన్నా తక్కువ జీతగాళ్ళే! అయినా ఎంత జాలీగా గడుపుతున్నారో...

నాన్న ఈ దేబిరింపుకు అమ్మ రిటార్ట్. మీరు చెప్పున్నట్టుగానే డబ్బు మంచివీళ్ళ ప్రాయంగా జల్సాలకు ఖర్చుచేసే మీ మిత్ర బృందం ఆకారాలు చూస్తున్నారు కదా! ఒకరికి ముఖంలో కళ ఉందా? గాల్లో తేలుతుంటారు పీలగా. ఖళ్ ఖళ్న అసహ్యంగా దగ్గు. చత్వారం కళ్ళద్దాలులేని దెవరికి? అదే ముప్పై ఐదుకు అటు ఇటుగా ఏ ఐదారేళ్ళు తక్కువ వారిలా కనిపిస్తున్నారు మీరు—ఒళ్ళంతా మిసమిసలాడుతూ ఎక్కడైనా, ఎప్పుడైనా చెడు ఆకర్షించినట్టు మంచికా శక్తి లేదులెండి!

నాన్న మితభాషి.

ఆ బలహీనతనే అమ్మ క్యాష్ చేసుకోవడంలో భాగంగా ఈ అదుపాజ్ఞలు...

భర్తనంతటి వాడినే అలా ఖండిస్తూ కట్టడిచేసే తను ఇంక నా విషయంలో...హ్హూ...

ఎలాగోలా రోజులు దొర్లిపోతున్నాయిలే అని ఆ తలపులకు స్వస్తి చెప్పి ప్రస్తుతానికొచ్చాడు గోపి.

చేతిలోకి ఫ్రీగా బుడగ వచ్చిందన్న ఆనందం ఇవ్వదు. గుండె లోతుల్లోంచి తన్నుకు రాగా దానికి సంకేతంగా బుడగను పైకెగరేశాడు.

అది కిందికి వాలుతూంటే పట్టుకొంటూ మళ్ళీ పైకెగరేస్తూ రెండు చేతుల మధ్య ఉంచుకొని దాన్ని కన్నార్పకుండా చూస్తూ...

అలా ఆడుతూ, పాడుతూ ఇంటిదారి పడ్తున్న గోపి హఠాత్తుగా ఆగిపోయాడు.

ఒకరి సొమ్మును మనం తేరగా ఆశించకూడదు! ఎంతకూ మనకున్నదాంతోనే సరిపెట్టుకోవాలి! నువ్వింకా చిన్న పిల్లాడివి కాదు. పదేళ్ళు రాబోతున్నాయి. ఇప్పట్నుంచే మంచి బుద్ధులు, హుందాతనం అలవరుచుకో! ఏదైనా తింటున్నా కొంటున్నా ఇంకొకరికేసి ఆబగా చూడకు! గాలిలేనోడేమో అని జాలిపడి భిక్షంలా నీకింత రాలిస్తే ఎంత అవమానం? నీకన్నీ మీ నాన్న బుద్ధులేరా! ఏదీ స్వంతగా ఆలోచించలేరు. మీ ఇద్దర్నీ తీర్చి దిద్దలేక నా ప్రాణానికొస్తోంది...ఈ ఉపన్యాసమే దంచుతుంది అమ్మ ఖాయంగా, ఈ బుడగతో నేను కాని ఇంట్లో అడుగు పెడితే.

ఆమె నోటికి ఝడిసి అప్పుడేమని అబద్ధం చెప్పనబ్బా?

అలాగని బుడగను ఇక్కడే పారేసిపోను మనసొప్పుతుంటేనా?


ఈ దోలాయమానంతో కాసేపు అటు ఇటు మదనపడ్డాడు గోపి.

ఏదైతే అదే అయ్యిందిలే అన్న వెర్రి ధైర్యానికొచ్చాడు చివరికి.

అతని టైం బావుంది.

ఇంట్లో అడుగు పెడ్తూనే అప్పుడే హడావిడిగా బయటికి వెళ్ళబోతోంది తల్లి.

ఎక్కడిదిరా ఆ బుడగ? దానికి




డబ్బు మీ నాన్న ఇచ్చుంటాడు కదూ? పక్క వీధిలో లలిత వాళ్ళు పిలిచివెళ్ళారు, వాళ్ళబ్బాయి బర్త్‌డే ఫంక్షనుందని. కాసేపట్లో మీ నాన్న వచ్చేస్తాడు. ఇంట్లో జాగ్రత్తగా ఉండు!

చీరె మడతలు సవరించుకుంటూ, చెప్పుల్లో కాళ్ళు దూర్చి అదే పోక!

"హమ్మయ్య! ఓ గండం గడిచింది. తేలిగ్గా నిట్టూర్చాడు గోపి.

ఆమె అటు వెళ్ళింది. పక్కనే తండ్రి దిగబడ్డాడు.

నా చేతికి మీ అమ్మ సరిపడ డబ్బివ్వకుంటేనేం గోపీ? మా ఫ్రెండ్స్ లేరూ...స్నేహానికి ప్రాణమిస్తారు వాళ్ళు! నీకూ చాక్లెట్ తెచ్చాను, ఇదిగో...ఈ బుడగ ఎక్కడిదమ్మా? మీ అమ్మ కొని చ్చిందా?

ఇంట్లో భార్య జాడలేనట్లు తెలుసుకొని తెగ హుషారుపడిపోయాడతను.

ఉఫ్ ఉఫ్న సిగిరెట్ ఊదేస్తున్నాడు.

జేబులోంచి కిళ్ళీ తీసి నోట్లో పెట్టుకొన్నాడు.

ఏదేదో తల తోక లేకుండా వాగుతున్న తండ్రిని విడ్డూరంగా చూశాడు గోపి.

'భార్య ముందేమో నడుస్తూ ఆమెకు వెనుక ఇలా స్వాతంత్ర్యం అనుభవించే మగవాడూ ఉన్నాడు లోకంలో ప్ప్...స్వగతంతో.

అయితే ఈ ఇంటి ఆడపెత్తనం, పొదుపరితనం నేపథ్యంలో—

సిటీ సెంటర్లో విలువైన ఫ్లాట్ లకారానికి చేరువ కాబోతున్న బ్యాంక్ బ్యాలెన్స్!

ఇందుకు దోహదకారైన అమ్మ డిసిప్లీన్ వల్ల మనిద్దరికీ ఆర్థిక స్వాతంత్ర్యం లేనిమాట సత్యమైనా మన భవిష్యత్ కిది పూలబాటేగా. బయట తిరిగే మగవాళ్ళుగా వాళ్ళు—వీళ్ళను చూపి అమ్మను తిట్టిపోస్తుంటాంకానీ!

ఆమె మన పాలిటికి దైవంలాంటిదని విస్మరించి!

చంటికి ఆరోగ్యం చేకూర్చే మందులన్నీ చేదే ఏఖార్చుగా.

వాటిని చీదరించుకొంటూనే స్వీకరించక తప్పుతోందా జబ్బులొస్తే?

సరిగ్గా అలాంటిదే అమ్మతో మన సాహచర్యమూనూ...చిన్న బుర్రలైనా పెద్ద మనసుగా ఇదే తలపోశాడు గోపి—

తండ్రి సిగిరెట్, కిళ్ళీల మజాలో ఉండే తనిటు చాక్లెట్, బుడగల మజాలో తేలుతూ.

— వి.ఎం.ఎస్. స్వాతి